# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. అమరావతి నిర్మాణానికి రుణాలు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి, సీఆర్డీఏ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్ర మంత్రివర్గం చర్చిస్తోంది.
2. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
3. ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులకు సహకారం అందించాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కెనడా పరిశ్రమల ప్రతినిధులను కోరారు.
4. రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి ఇకపై రోజూ రైతుల నుంచి అర్జీలు స్వీకరించనున్నామని సీఆర్డీఏ వెల్లడించింది.
5. అంతర్జాతీయ పర్వతాల పరిరక్షణా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. మంత్రి వర్గ సమావేశంలో అమరావతి నిర్మాణానికి సంబంధించిన రుణాలు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి, సీఆర్డీఏ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై మంత్రివర్గం ఆమోదం తెలుపనుంది.

-------------------------

విశాఖపట్నంలోని ఐటీ హిల్స్‌పై ఏడు ఐటీ సంస్థలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు భూమి పూజ చేస్తారని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో కాగ్నిజెంట్ సంస్థ భూమిపూజలో పాల్గొంటారని వీటితో పాటు పలు ఐటీ సంస్థలకు శంకుస్థాపనలు చేస్తారని అన్నారు. అనంతరం విశాఖ ఆర్థిక ప్రాంతం –వీఈఆర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న భూములు, వీఈఆర్‌పై సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు.

-------------------------

రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కేంద్ర గ్రామీణ అభివృద్ధి

శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఢిల్లీలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కావాల్సిన అనుమతులను మంజూరు చేస్తోందని తెలిపారు. హడ్కో, కేంద్రీయ విద్యాలయం వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలను రాజధానిలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులకు సహకారం అందించాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. కెనడా పర్యటనలో భాగంగా టొరంటో కాన్సలేట్ జనరల్ ఆఫ్ ఇండియా -CGI కపిధ్వజ ప్రతాప్ సింగ్, కెనడా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ -CIBC ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... భారత్‌లో పారిశ్రామిక పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమైన ప్రాంతమని తెలిపారు. వేగవంతమైన వాణిజ్య విధానాలతో రాష్ట్రం పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంత్రి విజ్ఞప్తిచేశారు. అనంతరం టొరంటో కాన్సులేట్ జనరల్ కపిధ్వజ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామికాభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు.

---------------------------

హస్తకళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన తోడ్పాటును అందిస్తున్నాయని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన జాతీయ హస్తకళా పురస్కార గ్రహీత విజయలక్ష్మి తెలిపారు. రెండురోజుల క్రితం ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా జాతీయ హస్తకళా పురస్కారాన్ని అందుకున్న ఆమె ఈరోజు స్వగ్రామం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తిలో పాత్రికేయులతో విజయలక్ష్మి మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి ఇకపై రోజూ రైతుల నుంచి అర్జీలు స్వీకరించనున్నామని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ-సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతిలోని రాయపూడిలో ఉన్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ప్రతిరోజూ అర్జీలను స్వీకరించనున్నామని చెప్పారు. పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, రైతుల సమస్యలు, వినతులు పరిష్కరించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

---------------------------

కాశీ తమిళ సంగమం సాంస్కృతిక కార్యక్రమం మాత్రమే కాదని, భారత్ ను ఏకం చేసే ఒక ప్రధాన ఉత్సవమని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మ అన్నారు. కాశీ తమిళ సంగమం 4.0 కార్యక్రమంపై కేంద్రమంత్రి నిన్న ఢిల్లీలో మాట్లాడుతూ, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ దార్శనికతకు ఈ సంగమం ప్రతీక అని పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక సంగమం జాతీయ స్థాయిలో భారతీయ భాషల మధ్య అంతరాన్ని తగ్గిస్తుందన్నారు. కాశీ తమిళ సంగమం ముగింపు వేడుక తమిళనాడులోని రామేశ్వరంలో ఉంటుందని కేంద్రమంత్రి వివరించారు.

---------------------------

అంతర్జాతీయ పర్వతాల పరిరక్షణా దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ప్రకృతి మనకు అందించిన సహజ వనరులలో పర్వతాలు ఒకటి. మొదటి తరం నాగరికతా ఆనవాళ్ళు నదులు, పర్వత ప్రాంతాలలోనే బయటపడ్డాయని చరిత్ర చెబుతోంది. పర్వతాలు అనేక జీవ జాతులకు నిలయంగా ఉంటున్నాయి. ప్రపంచ జనాభాలో 15 శాతం మంది ప్రజలు పర్వతాలవద్దనే నివసిస్తున్నారంటే... వీటి ప్రాముఖ్యత ఏమిటో విదితమవుతోంది. 'పర్వతాలలోని హిమని నదాలు–నీరు, ఆహారం, జీవనోపాధికి చాలా ముఖ్యమైనవి" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ పర్వతాల పరిరక్షణా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. విజయవాడలో నిర్వహించిన ఉర్దూ అకాడమీ ఉద్యోగుల సమీక్షా సమావేశంలో అన్ని మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉర్దూ అకాడమీకీ 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉర్దూ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో "సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్" పేరుతో ఈనెల 16 వ తేదీ నుండి 20 వరకు వారోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. నూతన సాంకేతికత, కృత్రిమ మేధ ద్వారా మైనారిటీ యువతకుఉపాధి అవకాశాలను కూడా మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ యధాతధంగా కొనసాగుతుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రి సుభాష్ నిన్న ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గం పరిస్థితిని ముఖ్యమంత్రిదృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, రామచంద్రపురం రెవిన్యూ డివిజన్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయాలు అక్కడే కొనసాగుతాయని , ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. అలాగే రామచంద్రపురం నియోజవర్గం అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయిస్తానని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి లోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతోందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేశారు.

---------------------------

డిసెంబరు, జనవరిలలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించనున్న పలు పర్వదినాల నేపథ్యంలో ఆయా రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి ప్రకటించింది. ఆలయంలో ఈనెల 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 29 నుంచి జనవరి 8 వరకు, 25న రథ సప్తమి కారణంగా ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టిటిడి పేర్కొంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు సహకరించాలని కోరింది.

====================